

మురళీకృష్ణ

"నను పాలింప.. నడచి.. వచ్చితివో..." శ్రావ్యమైన కంఠంతో మధురంగా పాడుతోన్న పాట వినపడగానే అలవాటు ప్రకారం కాళ్ళు ఆగిపోయాయి. గత నాలుగైదురోజులుగా తను అక్కడకు వచ్చేసరికి ఆ పాట వినపడడం, తనకు తెలియకుండానే ఆగి పాట పూర్తయేవరకు విని వెళ్ళడం జరుగుతోంది. ఆవిడ ఆ అరుగు మీద కూర్చొని సంగీత పాఠాలు చెప్పడం తనకు కొత్తేమీకాదు, కాని యింతకుముందు తానా విషయానికంతగా ప్రాధాన్యత నిచ్చేవాడు కాదు. సాయంత్రం కాలేజీ నుండి యింటికి రాగానే, వదిన యిచ్చిన కాఫీ త్రాగాక, బట్టలు మార్చుకొని పార్కుకు వెళ్ళి విశ్రాంతి తీసుకోవడం తన కలవాటు. కాని యీమధ్య కొన్నాళ్ళుగా పార్కుకని వెడుతూ రాజవీధి మలుపు తిరిగి దీక్షితులవారి ఎత్తు అరుగుల యింటి దగ్గరకు వచ్చేసరికి, "నను..పాలింప.." పాట శ్రావ్యంగా విన్పించడం, పాట పూర్తిగా విన్న తర్వాత గాని కదలకపోవడం నిత్యకృత్యమైంది. తన కిష్టమైన మోహనరాగం ఆవిడ ఆలాపించడంలో వుందో లేక మోహనరాగం పాడడంలో ఆవిడ కనపర్చే ప్రత్యేకత ఏమైనా వుందో లేక త్యాగరాజు మోహనరాగంలో తన సాహిత్యాన్ని మేళవించిన పద్ధతిలో వుందో తనకు తెలియదు కాని ఆపాట ఆవిడ పాడే పాటలన్నింటిలోకి ప్రత్యేకంగా వుంది. రోజూ ఐదారు నిమిషాలసేపు తనను ఆకట్టుకొని నిల్చుండేలా చేస్తోంది.

అప్పటినుండి ఆవిడను గురించి తెలుసుకోవాలని వుంది. కాని ఓ యువతి ఆడపిల్లలకు సంగీత పాఠాలు చెపుతున్నపుడు, రోడ్డు మీద నిల్చొని వినడమే కొందరి దృష్టిలో అసభ్యతగా కన్పడవచ్చు. ఇక ఆవిడ వైపు నిశితంగా చూడడంకాని, ఆవిడను గురించి ఆరా తీయడంకాని చూస్తే, మరి చెప్పక్కర్లేదనుకొని, పార్కు వైపు కాలు సాగించడం జరుగుతోంది రోజూ. అయినా మోహనరాగం సృష్టించిన ఆసక్తి నా ఆతృతని పెంచింది.

ఓ పెండ్లికాని అమ్మాయిని గురించిన వివరాలు అమ్మనడిగే ధైర్యంలేక, అమ్మలేని సమయం చూచి వదిన నడిగాను. "ఏమిటి విశేషం?" అంటూనే చెప్పింది వదిన. సారాంశం ఏమిటంటే—ఆవిడ పేరు 'సరస్వతి.' తాలూకాఫీసు గుమాస్తా సుందరరామయ్యగారి ఏకైక పుత్రిక. చక్కగా కర్ణాటక సంగీతం పాడుతుంది. ఏదో మధ్యతరగతి కుటుంబం గనుక చుట్టుపట్ల వున్న అమ్మాయిలకు సంగీత పాఠాలు చెపుతుంది. మేమున్న వీధికి వాళ్ళున్న యిల్లు కాస్త దూరం కాబట్టి వదినకూ ఆవిడకూ పెద్ద పరిచయం లేదు. కాని రెండుమూడు సార్లు పేరంటంలోనో, దేవాలయంలోనో మాట్లాడిన పరిచయం మాత్రం వుంది. కాకపోయినా వుద్యోగాలు చేసే అమ్మాయిలంటేనూ, ట్యూషన్లు చెప్పే అమ్మాయిలంటేనూ సొసైటీ కాస్త యింటరెస్టు చూపుతుంది కాబట్టి, వదిన ఆ ఇన్‌ఫర్మేషన్ యివ్వగలిగింది.

ఆరాత్రి పెరట్లో కొబ్బరిచెట్టు క్రింద వెన్నెలలో పడుకొని 'మోహనరాగం' కూనిరాగాలు పాడుకొంటున్నపుడు ఆవిడ మధురగానం జ్ఞాపకం వచ్చి నా సంగీతం ఆపివేశాను.వచ్చిరాని నా సంగీత జ్ఞానంతో ఆ పాటకూ—త్యాగరాజుకూ అన్యాయం చేయడం యిష్టంలేక! ఆవిడ పేరు 'సరస్వతి' అనే కంటే 'సుగాత్రి' అనివుంటే మరింత బాగుండుననిపించింది. నిద్రకి ఒరిగే ముందు ఆవిడ నా అభిమాన వ్యక్తి అయిందని నిర్ణయించుకొని, మరీ నిద్రపోయాను.

మరురోజు సాయంత్రం మళ్ళీ దీక్షితుల వారి ఎత్తు అరుగుల యింటి ముందు ఆవిడ 'మోహన' నన్ను సమ్మోహితుణ్ణి చేసి నిలవేసింది. వాళ్ళ వాకిలి ప్రక్కన వున్న మునిసిపాలిటీవారి సువాసనను లెక్కజేయక కళ్ళు మూసుకొని నిల్చొన్న నేను—ఎవరో పిలిచినట్లయి యీ లోకంలోకి వచ్చాను. చేతితో తట్టి పిలిచిన వ్యక్తి వైపు చూశాను పరిశీలనగా! ఆ పెద్దమనిషికి యాభై యేళ్ళుంటాయి. నెరిసిపోయిన తల—ముక్కు మీదకు జారిన సులోచనాలు జీవితంలో అలిసిపోయి వంగిపోతున్న శరీరం అక్కడక్కడా అతుకులు కన్పించే పొడుగాటి చొక్కా—ఓచేతిలో గొడుగు మరో చేతిలో నిండుగా ఫైళ్ళు—చూడగానే చెప్తున్నాయి ఆయన గుమాస్తాగిరీ వెలిగిస్తున్నారని! "బాబూ! రోజూ సాయంత్రం చూస్తున్నాను, ఏమిటి పాటేనా వింటున్నారు?

మా అమ్మాయే పాడేది." "మా" అన్నచోట వొక్కి వలుకుతున్నపుడు ఆయన కళ్ళలో మెరుపు నేను గమనించకపోలేదు.

"కావండి..." వినయంగా జవాబు చెప్పాను.

"లోపలికి రండి! అక్కడ కూర్చొని వినుదురు గాని"—అన్న ఆయన ఆహ్వానం ఓవిధంగా వింతని పించింది నాకు. ఎందుకంటే ఓ అమ్మాయి పాడే సంగీతం, అందులోనూ శ్రావ్యంగా వున్నపుడు వీధిలో పోయే వారికి ఆసక్తిజనకం కావడంలో ఆశ్చర్యంలేదు. చాలాగా ఎంతోమంది ఆవిడ గానాన్ని రోడ్డు మీద నుండీ వింటూండవచ్చు. తత్ఫలితంగా వీధిన వెడుతూ కొంతసేపు ఆగి పాట విని వెళ్ళే శ్రోతలు ఆయనకూ క్రొత్త కాకపోవచ్చు. అలాంటప్పుడు ఆయన ఆహ్వానం నాకు కొంచెం సంకోచం కల్గించిన మాట నిజమే.

"అక్కడే నిలబడ్డారేం? ఫరవాలేదు లోపలికి రండి!" అని ఆ పెద్దమనిషి మరోసారి అనడంతో ఆయ న్ననుసరించాను.

మేము లోపలి కడుగు పెట్టేసరికి, ఆరోజ పాఠం పూర్తయింది కాబోలు శిష్యురాండ్రందరూ యిండ్లకు వెళ్ళే సంభరంలో వున్నారు. వాళ్ళందరూ బయటకు వెళ్ళే దాక ఓ ప్రక్కన నిల్చొని, తరువాత అరుగు మీద కూర్చొన్నాము.

"అమ్మాయ్! ఓ సారి యిలా రావమ్మా" పిలిచా రాయన.

గుమ్మం దగ్గిర గాజుల చప్పుడుకు దృష్టినటు వేపు మళ్ళించాను. రోజూ నన్నాకట్టిన 'మోహన' రాగాలాపన కర్తను దగ్గర నుండీ మొదటిసారిగా చూశాను. ఇరవై వసంతాలు నిండిన ఆ సంగీతమూర్తి పెద్ద అందకత్తేమీ కాదు, కాని ఆ కళ్ళలో ఏదో ఆకర్షణ వుంది!

"మా అమ్మాయి సరస్వతి!".... "చూడమ్మా! వీరు రోజూ నీ పాటకోసం మన గుమ్మం దగ్గర గుడారం వేస్తున్నారు. ఈరోజు లోపలకు వచ్చారు నా ఆహ్వానంతో.." ఇరువురినీ పరిచయం చేశారు సుందరరామయ్య.

చిరునవ్వుతో సిగ్గును మిళాయించి, "నమస్కారం" అంది ఆవిడ. అది కూడా మోహనంగానే వుందనిపించింది.

నన్ను గురించి వారికేం తెలియదు కాబట్టి నన్ను నేను వివరంగా పరిచయం చేసుకోక తప్పలేదు. 'ఫలానా' అని చెప్పగా, మా వదినను తనకు కొద్దిగా తెలుసునంది. "మా యిద్దరికీ కాఫీ కలిపి తీసుక రావమ్మా! మీ అమ్మనడిగి!" అన్నారాయన గోడకు చేరగిలబడి.

కాసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది. మాటలెలా సాగించాల్లో తెలియలేదు నాకు. ఏమిటో ఆలోచిస్తున్నారు సుందరరామయ్య.

లోపలి నుండి ఏవో మాటలు విన్పించాయి అప్రయత్నంగానే నా చెవులటు వైపు కేంద్రీకరించాయి.

"ఆయనకేం! చెపుతూనే వుంటారు మహరాజు! మ్రింగ మెతుకు లేకపోయినా మీసాలకు సంపెంగి నూనె కావాలన్నాడట, అలా వుంది. ఈ అతిథి మర్యాదలలోనూ, బంధుప్రేమతోనూ యింత స్థితికి వచ్చింది సంసారం...సరే! ప్రక్కయింటి కెళ్ళి రెండు చెంచాలు కాఫీపొడి పట్రా సరసూ!" మాటలలో విసుగు స్పష్టంగా ధ్వనించింది. పాపమా యిల్లాలు ఎంత బాధ పడుతోందో!

"వాళ్ళింటి కెళ్ళనమ్మా! ఇప్పటికే రెండుమూడు సార్లు కాఫీపొడి, పంచదార యింకా ఏవో బదులు తెచ్చాను. అన్నింటికీ వెడితే—" అర్థోక్తిలో ఆపింది దీనస్వరంతో.

"ఎలాగో అడిగి తీసుకురా తల్లీ, ఏంచేద్దాం"

"............"

ఆ తర్వాత మాటలు వినబడలేదు... లోపలి కెందుకు వచ్చానాని బాధ, ఈయన కాఫీ కెందుకు చెప్పి పంపాడా అన్న చింత కలిగింది నాకు.

ఇంతలో సుందరరామయ్య ఏదో చెప్పనారంభించారు.

"లేపు శ్రావణమాసంలో ముహూర్తాలు పెట్టుకొన్నాం నాయనా అమ్మాయికి! ఎలాగో దాన్నొక అయ్య చేతిలో పెడితే నాకు సంతృప్తి. అయినా మా అమ్మాయికేం తక్కువయ్యా? అదృష్టం దాని నొసటనే వ్రాసుంది.కాకపోతే అంతటి ఐశ్వర్యవంతులు వాళ్ళంతట వాళ్ళు రావడమేమిటి, వెంటనే అన్నీ స్థిరపడిపోవడమేమిటి చెప్పు?... అబ్బాయి తండ్రికి పాతికెకరాల మాగాణి, నాలుగ్గైదు ఎకరాల మామిడి తోటలు, రెండు 'ల' కారాల రొక్కం—యింతకు మించి ఏం కావాలి మరి?!.. అసలు అది పుట్టినప్పుడే నాకు తెలుసు—దానికోసం ఏ మహరాజో వెతుక్కొని వస్తాడని!..."

"నాన్నా! కాఫీ!" అమ్మాయి పిలుపుతో వుపన్యాస ప్రవాహానికి ఆనకట్ట వేశారాయన. కాఫీ తాగుతూ ఆలోచించాను నేను... ఆయన చెప్పిన సంబంధం తాలూకు వివరాలు కాస్త ఎబ్బెట్టుగా కన్పించాయి. ఆయన చూస్తే నేవో మామూలు గుమాస్తా—అంత పెద్ద సంబంధం తేవడ మేమిటి, వారితో సరితూగడ మేమిటి? అనిపించక పోలేదు.

ఇంతలో సుందరరామయ్య కాఫీ ముగించి, మళ్ళీ వుపన్యాసం సాగించారు. "అంతపెద్ద సంబంధం కలిసి వచ్చేటప్పుడు, ఏడువేల కట్నమేపాటు అంటారు? అసలు లాంఛనంగా వారు అడిగారు కాని ఏడువేలు వారికేమూలకు లెక్క? ఆ!... అయినా మా 'సరస్వతి'కేం లోపమండీ? అసలది వారింటి కోడలు కావడం వారి అదృష్టం కదూ!.."

ఈ సంభాషణతో ఆయన స్వభావం కాస్త పసిగట్టగలిగాను. ఉన్నది లేనిది కల్పించుకొని గొప్పగా చెప్పుకొనే తత్వంగా కన్పిస్తోంది ఆయన ధోరణి. ఏదో సామెత చెప్పినట్లు, "ఇంటివారు కస్తూరి వారు..." అన్న రీతిగా! దాదాపు నెలరోజులలో జరుగబోయే వివాహానికి అన్నివేలు సర్దగలందుకు ఆయన భరోసా ఏమిటో?... అయినా అంత తక్కువ వ్యవధిలో ఎదుటి వ్యక్తిని గురించి అంచనా వేయడం భావ్యం కాదేమోననుకొన్నాను!

"చీకటి పడుతోంది. వెళ్ళొస్తానండీ!" అంటూ లేచాను.

"అప్పుడప్పుడు వస్తూండు నాయనా!...నాకోసం కాకపోయినా మా 'చెల్లాయి' పాట కోసమైనా"

ఆయన సంబంధం కలిపిన తీరు ఆశ్చర్యమేసింది. కాని మరుక్షణంలోనే ఎంతో సంతోషించాను.. ఆ 'సుగాత్రి' చేత 'అన్నయ్య' అని మధురంగా, ఆప్యాయంగా పిలిపించుకోగలిగిన అవకాశం కలిగినందుకు.

"అలాగేనండీ!..." అని ఆయన పద్ధ సెలవు పుచ్చుకొని, గుమ్మం వైపు చూశాను. చేతి వేళ్ళకు చీర చెరగు మెలివేస్తూ నిల్చొని ముసిముసిగా నవ్వింది.

"వెళ్ళొస్తానమ్మా." నాకు తెలియకుండానే కంఠంలో ఆప్యాయత ధ్వనించింది.

"మంచిదన్నయ్యా! మీ అభిమానానికి కృతజ్ఞురాలిని!.. ఆ! వీలున్నప్పుడు మీ వదినగారి నోమాటు మాయింటికి తీసుకరండి" అంది సరస్వతి.

సమాధానంగా తలవూపి, మెట్లు దిగి రోడ్డు మీదకు వచ్చేశాను....

ఆ రాత్రి భోజనం చేస్తూ జరిగిన సంగతి అమ్మకూ, వదినకూ చెప్పాను.

"అబ్బాయిలతో మాట్లాడేందుకే సిగ్గుపడే వాడివి, అమ్మాయితో ఎలా మాట్లాడేవయ్యా వేణూ!" అంటూ నవ్వింది వదిన.

"పోనీలే! 'అన్నయ్య' అని పిలిచే వారెవరూ లేరని కొరవ పడేవాడివిగా, నీ ముచ్చట తీరి ఓ 'చెల్లెలు' దొరికింది" అంది అమ్మ. ఆమాట నిజమే! అమ్మకు ఆడపిల్లలు లేనందున, 'ఎవరైనా చెల్లెలుంటే, బాగుండు'నని నేను అనుకొనేవాణ్ణి. అమ్మ అన్నట్లు ఇప్పుడా ముచ్చట తీరింది.

"నిన్నెపుడయినా వాళ్ళింటికి తీసుక రమ్మంది వదినా" అన్నాను సరస్వతి తరపున ఆహ్వానిస్తూ.

"....." వదిన జవాబు చెప్పలేదు. అమ్మ వంక చూచింది.

"వెళ్ళిరా శాంతా! తీరినప్పుడెపుడో సాయంత్రం వెళ్ళి, తర్వాత మనింటికి తీసుక రావమ్మా! వస్తూ పోతూ వుంటేనే పరిచయాలు, స్నేహాలు ఏర్పడేది." అమ్మ గ్రీన్ సిగ్నల్ యిచ్చింది.

ఓ రెండు మాసాలు గడిచాయి. మా రెండు కుటుంబాల మధ్య పరిచయం బాగా పెరిగింది. కనీసం రెండురోజుల కొకసారైనా నేను యింట్లో వున్న సమయంలో యింటికి వచ్చేది సరస్వతి.. 'అన్నయ్యా', 'అన్నయ్యా' అంటూ తెగ మాట్లాడి, నన్ను మాట్లాడించేది. ఇద్దరి మధ్యా ఏ అరమరికా, దాపరికం లేని సన్నిహితులయ్యాము. ఆడపిల్లలు లేని కొరత 'సరస్వతి'తో తీర్చుకొనేది అమ్మ. అంతగా చేరిపోయింది మా కుటుంబంలో సరస్వతి!

కాని యీ మధ్యకాలంలో ఓ ముఖ్యసంఘటన జరిగింది. బహుశా ఆ సంఘటన జరిగిన తర్వాతనే, మానసికంగా క్రుంగిపోయిన సరస్వతిని ఓదార్చడం మూలాన నేనూ సరస్వతీ మరింత సన్నిహితులయ్యామేమో అనిపిస్తుంది. గతమాసంలో జరుగవలసిన సరస్వతి పెండ్లి అర్ధాంతరంగా ఆగిపోవడమే ఆ సంఘటన! తల్చుకొంటేనే యిప్పుడు గూడా ఎంతో బాధ వేస్తోంది!!

సుందరరామయ్య గారితో మొదటిసారిగా పరిచయమైనపుడు ఆయనను గురించి నాలో పొడచూపిన భావం అక్షరాలా నిజమైంది. పైపెచ్చు సరస్వతితోడి సన్నిహితత్వం వలన ఆయనను గూర్చి మరింత తెలిసింది. ఏమాత్రం లేకపోయినా బోలెడున్నట్లు యితరులతో చెప్పుకోవడం ఆయనే స్వభావం. అది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందా అన్న యోచన ఆయనకు కలుగదు. దానికి తోడు కాస్త 'అహం' వున్న వ్యక్తి. అవసరం వున్నపుడు యెదుటివాడిని చేయి చాపి అడగడం యిష్టంలేకపోయినా







# తప్పు

లౌక్యంగా సంపాదించి అవసరం గడుపుకోవడం ఆయనకు చేతకాదు. తన వారెవయినా అవసరం గ్రహించి తెచ్చి యిస్తే పుచ్చుకొంటాడు, అదీ ఏదో వాళ్ళ తృప్తికోసం తీసుకొంటున్నట్లు—ఈ తత్వమే సరస్వతి వివాహం ఆగిపోవడానికి కారణమైంది.

పిత్రార్జిత మంటూ ఓ ఎకరం పొలం తప్ప మరేం లేదు. నెలయేసరికి చేతిలో పడే నూటపాతిక రూపాయల జీతం, సరస్వతి సంగీతం ట్యూషన్ల వలన వచ్చే ఓ పాతిక రూపాయలు. ఈ సంపాదనతో యిల్లు గడవాలి. పక్షవాతంతో మంచంలో తీసుకొంటోన్న ముసలి తల్లి మందులూ మాకులూ, భర్తపోయి పుట్టిల్లు చేరిన చెల్లెలూ, బిడ్డలూ—అందరూ కలిసి యింట్లో ఏడెనిమిది మంది జనాభా—'బ్లాక్ మార్కెట్'లో తప్ప మామూలు ధరలకేవీ లభించని రోజులు—ఈ పరిస్థితిలో ఏదో తగిన సంబంధం మాడక అందని పళ్లకు అర్రులు చాచినట్లు పై అంతస్థులకి సంబంధం చూడడం, వాళ్ళు లాంఛనంగా అడిగిన కట్నం ఏడువేలు ఏపాటులే అన్నట్లు చెప్పడం—నిజంగా సుందరరామయ్య మూర్ఖత్వానికి, లేని డాబుసరి నటించే తత్వానికి నిదర్శనం.

ముహూర్తం నిశ్చయంచేసుకొన్న రోజు పెండ్లి వారు కట్నం డబ్బును గూర్చి ఓ నిబంధన పెట్టారు. వివాహానికి మూడురోజుల ముందుగా ఐదువేల రూపాయ లందజేయాలనీ, లగ్నం సమయంలో మిగతా డబ్బు యివ్వాలనీ చెప్పారు. బావిలో నీరు చేది అందివ్వగలిగేంత నిశ్చింతగా, సరేనన్నారు సుందరరామయ్య. ఉన్న ఎకరం పొలం అమ్మగా మూడువేలకంటే ఎక్కువ రాలేదు. మిగిలిన మొత్తం ఎలా తేవడమూ అన్న చింత సుందరరామయ్యకు పెండ్లి పదిరోజుల సమీపానికి వచ్చేవరకుగానీ కలుగలేదు.

సుందరరామయ్య బావమరదు లిద్దరూ వూళ్ళోనే వున్నారు. పెద్దతను విశ్వనాథం. నెల్లూరులో పేరు పొందిన క్రిమినల్ లాయర్. కారులో తప్ప నేల మీద కాలు మోపే అవసరం లేని స్థితి ఆయనది. రెండో బావమరది రంగనాయకులు. కొన్నాళ్ళు మైకా వ్యాపారం చేసి, లాభం గడించి ప్రస్తుతం రాజకీయ వ్యాపారం చేస్తున్న వ్యక్తి. ఆయన కూడా బాగా కలిగినవాడే! సుందరరామయ్య తన అవసరానికి వారిని చేరి ఏమాత్రం అడిగినా వాళ్ళు, ముందు నిలబడి అన్నీ చేసేవాళ్ళే! తాను వెళ్ళి 'దేహి' అని అడుగక్కర్లేదు. మాటవరసాయంగా అడిగితే చాలు! కాని సుందరరామయ్యలో వున్న దుర్గుణం అదే! "తను వెళ్ళి వాళ్ళనడిగే దేమిటి? తన కుమార్తె పెండ్లి విషయం వాళ్ళకు తెలియదూ? వారే వచ్చి పలుకరించి, అవసరం తీర్చవలసిన బాధ్యత వాళ్ళకు లేదూ" అన్నది సుందరరామయ్య నిశ్చితాభిప్రాయం. దానికి తోడు పరిచయస్థుల వద్ద బావమరదులను గూర్చి నిందా పూర్వకంగానూ, నిరసనగానూ మాట్లాడడం చేత, సరస్వతి పెళ్ళి విషయంలో వాళ్ళిద్దరూ దూరంగానే వుండిపోయారు. కాని చెల్లెలి మీద ప్రేమతోనూ, మేనకోడలి మీద అభిమానంతోనూ చెరొక వేయి రూపాయలు పంపారు మరో మూడో మనిషి ద్వారా... ఎలాగో మొత్తం కలిసి ఐదువేలు సమకూడింది. ఇక మరి మిగిలిన రెండువేల కట్నం, లాంఛనాలకు పెండ్లి ఖర్చులకు మొత్తం కలిపి మరో నాలుగు వేలయినా కావాలి. నిశ్చితంగా వ్యాఖ్యానాలు చేస్తూ రోజులు వెళ్ళదీశారు సుందరరామయ్య.

పెండ్లి అయిదురోజులుంది.. పత్రికలూ అవీ తాహతుకు మించి భారీఎత్తులో అచ్చువేయించి పంచిపెట్టారు. బంధువులు ఒకరొకరే రాసాగారు. పెండ్లి పనులు ఒకదాని వెంట మరొకటి చురుకుగా సాగిపోయాయి.

ఆ సాయంత్రం చీకటి పడిన తర్వాత సరస్వతి మా యింటికి వచ్చింది. అమ్మతోనూ వదినతోనూ మాట్లాడాక నా గదిలోకి వచ్చింది, చేతిలో కొన్ని శుభలేఖలు పుచ్చుకొని.

"ఏమిటిది సరస్వతీ! నీవే అందరినీ స్వయంగా ఆహ్వానించేలా వున్నావే?" అని పలుకరించాను.

"అందరినీ కాదన్నయ్యా! ఆప్తులను, స్నేహితురాండ్రను మాత్రం." చేతిలో వున్న శుభలేఖల్లో నుండి ఒకటి తీసింది.

"ఇదుగో అన్నయ్యా!" అని నా చేతిలో శుభలేఖ వుంచి, "ఆశీర్వదించు చెల్లెలిని" అంటూ అమాంతం మోకాళ్ళ మీద కూర్చొని నా పాదాలు పట్టుకొంది. ఆక్షణంలో ఏమని జవాబు చెప్పాలో తోచలేదు నాకు.

"లే చెల్లాయ్!" అని లేవదీస్తుండగా, ఆమె కనుకొలకులలో నుండి రెండు కన్నీటి బొట్లు నా పాదాలపై బడ్డాయి.

"ఏమిటిది సరస్వతీ! శుభమా అంటే, కంట తడి...?"

"కాదన్నయ్యా!..." మరేదో చెప్పబోయింది కాని గొంతు జీరవోయింది.

కన్నీళ్ళు తుడుచుకొని నా వైపు చూసింది. నిశితంగా ఆవిడ కళ్ళలోనికి చూచాక గ్రహించగలిగాను—అవి ఆనందభాష్పాలేకాని దుఃఖాశ్రువులు కావని! కన్నెమనసులోని తీయని వలపు తలుపులు, రాబోయే వైవాహిక జీవితంలోని మధురానుభావాల వూహలు, ఇంకా మరేవో మాటల కందని ఆశలు, కోరికలు, భావాలు ఆ కళ్ళలో ప్రతిఫలించాయి ఆక్షణంలో!!

చెమ్మగిల్లిన కళ్ళతో మౌనంగా మనసులోనే ఆశీర్వదించాడు.

"అన్నయ్యా! నీవు రేపటినుండే సెలవు పెట్టాలి. చూచేవాళ్ళు నిజంగా మా అన్నయ్యే పెండ్లి జరిపిస్తున్నట్లుండాలి. అమ్మను, వదినను రెండురోజుల ముందే పంపించాలి..." ఇంకా ఏదో చెప్పుకపోయింది, అమాయకంగా సంబర పడిపోతూ.


"నీవింతగా చెప్పాలా చెల్లాయ్! నాకు మాత్రం తెలీదుటమ్మా! స్వంత చెల్లెలు కాకపోయినా నీవు నాకు దేముడిచ్చిన చెల్లెలివి. అంతేకాదు, 'మోహన' మనోహరంగా పాడి నన్నాకట్టిన చెల్లాయివి. నిజంగా ఇన్నాళ్ళకూ నీ పాటకు సార్థకత ఏర్పడింది. 'నిను పాలింప...'ఆ అదృష్టవంతుడు నడచి నీదగ్గరకు వచ్చాడు కదూ సరస్వతీ!...ఆ! ఇంతకూ బావగారెలా వుంటారేమిటి?" అనేసరికి సరస్వతి బుగ్గలు జడలోని ముద్దమందారలతో పోటీపడ్డాయి.

సిగ్గుతో ముడుచుకు పోయింది క్షణకాలం!

"వెళ్ళొస్తానన్నయ్యా! స్నేహితురాళ్ళిళ్ళకు వెళ్ళి శుభలేఖ లివ్వాలి" అంటూ వెళ్ళిపోయింది సరస్వతి.

ఆ మరునాడు సాయంత్రం సుందరరామయ్య చెప్పి పంపగా కాలేజీ నుండి రాగానే వాళ్ళింటికి వెళ్ళాను. నే వెళ్ళేసరికి ఎవరో నలుగురైదుగురు కూర్చొని డబ్బు విషయం మాట్లాడుతున్నారు. వారిని పరిచయం చేశారు సుందరరామయ్య. పెళ్ళికొడుకు తండ్రి, మేనమామ ఒప్పందం ప్రకారం ఐదువేల రూపాయలు పుచ్చుకోవడానికి వచ్చారు. మిగిలిన వారు ఇరుగుపొరుగువారు.

"మీరెన్ని చెప్పినా లాభంలేదు సుందరరామయ్యగారూ! మాట అన్న తర్వాత నిలకడ వుండాలి. ఆరోజు సరేనన్నారు కదా. ఇప్పుడు మూడువేలు చేతిలో పెడితే ఎలా?.... ఏంలాభం లేదు" చాలా నిష్కర్షగా



కొట్టేయడం వరకే పోలేదు. "అయినా కూడా మీరు కోర్చాను రామశేషయ్యగారూ! కానీ పెండ్లి ఖర్చులు త్రిండనే ఖర్చయింది. మిగతా వైఖరి ఆ రోజుకు సర్దుతాను గదా!" అని అబ్బాయి తండ్రి వైపు చూశారు సుందరరామయ్య.

ఆయన తనదేమీ లేనట్లు తన బావమరిది వైపు చూశాడు. కాని అతడు ఏమాత్రం లొంగలేదు. సుందరరామయ్య ఎన్నోవిధాల ప్రతిమాలాడు. అక్కడున్న అందరూ చెప్పి చూశారు. నా చేతనయినంతవరకూ నేనూ ప్రయత్నించాను. ఊహూ! తాను పట్టిన కుందేటికి కాళ్ళే లేవన్న వాదం వాళ్ళది! చివరకు, చేతిలో వుంచిన డబ్బును విసిరికొట్టి తమ సంబంధం, తత్ పెండ్లి ప్రయత్నాలు మానుకొమని, నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయారు.

ఏమైతేనేం, సుందరరామయ్య తత్వం వలన మూడురోజులలో జరుగబోయే సరస్వతి పెళ్ళి అర్ధాంతరంగా ఆగిపోయింది. జరుగుతోన్న పెళ్ళి పనులన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. వచ్చిన బంధువర్గం నువ్వుగా తిని, తర్వాత వాలుగు రకాలుగా దుయ్యబట్టి వెళ్ళిపోయారు. వీధిలోని వాళ్ళు పలువిధాలుగా విమర్శించారు. అసలు ప్రస్తుతం లోకంలో జరిగేదేమిటంటే—ఏ కారణం చేతనో ఓ సంఘటన జరిగితే దానికి పలుకారణాలు కల్పించి సాధ్యమైనంతవరకూ ప్రచారం చేసి ఆ వ్యక్తిని మానసికంగా హింసించి, తాము సంతోషించడం!

సరస్వతి యీ సంఘటనతో చాలా క్రుంగి పోయింది. వీధి ముఖం చూడడానికి కూడా జంకింది చాలా దినాలు. నేను వెళ్ళినప్పుడు, 'అన్నయ్యా!' అని చేతులు పట్టుకొని కన్నీళ్ళు పెట్టుకొనేది. ఓదార్పు అనేది ఆ పరిస్థితిలో అవసరమే అయినా, అది సరస్వతిని తృప్తిపరచ లేకపోయింది.

జీవితంలో ప్రధాన ఘట్టమైన 'వివాహం' మూలానా వ్యక్తితో అని స్థిరపడ్డాక, తనే స్వయంగా శుభలేఖలు అందించి, కాబోయే జీవిత భాగస్వామితోడి మధుర జీవితయాత్రా పథాన్ని గూర్చి తీయటి కలలు కని, జీవితానికి సార్థకతా, వయసుకూ—మనస్సుకూ, సౌరభమూ ఏర్పడబోతోందని మురిసి పోయే సమయంలో 'ఎడ్డెంగన విస్తరి' ముందు నుండి లాగి వేసినట్లయేసరికి కన్నెహృదయం ఎలా బాధపడుతుందోనన్న సంగతి అప్పట్లో సరస్వతిని చూచి గ్రహించగలిగాను.

కాని ఆ సమయంలో కూడా సుందరరామయ్య మీద జాలి కంటే కోపం కలిగేది, ఆయన మాటలు వినేసరికి. జరిగిన దాంట్లో తన తప్పేమీలేనట్లు, అసలేమీ జరుగనట్లు మాట్లాడేవాడు.

"వాళ్ళు గాకపోతే వాళ్ళు బాబులాంటి సంబంధం తెచ్చి చేస్తాను, ఏడువేలు కాకపోతే ఎనిమిదివేలు పోసి! అయినా మా అమ్మాయికేం తక్కువ?... వాళ్ళ యింటి కోడలుగా పొందే అదృష్టం వాళ్ళకు లేదు. ఏం చేస్తాం?"

కనీసం కుమార్తె మానసిక క్షోభనయినా గుర్తించాడు కాదేమిటా అనిపించింది ఆయన ధోరణి చూస్తే!

* * *

.....మరో ఆరునెలలు గడిచాయి.

ఆ మధ్యకాలంలో రెండుమూడు సంబంధాలు ప్రయత్నించారు సుందరరామయ్య, కానీ ఏవీ స్థిర

# తప్పు

పడలేదు. ఆతర్వాత ఒంగోలులోని సంబంధం ఒకటి ఏర్పాట్లయ్యాయి. అయితే యీసారి కూడా ముందుగా ఎవరినైనా సంప్రదించడంకానీ, ఎవరితోనైనా చెప్పడంకానీ చేయక పోవడమే గాకుండా, రాహుకు, అంతన్నూ, గతంలో జరిగిన సంఘటన—ఇవేవీ గమనించలేదు సుందరరామయ్య. ఎలాగో ఆసమయంలో సరస్వతి నా కోసం చెప్పి పంపింది, కాని సరిగ్గా అదే సమయంలో ఏదో అర్జంటు పని తగలడం మూలాన వెళ్ళడం కుదరలేదు. మరునాడు తెలిసిన విషయమేమిటంటే—వరుడు ఒంగోలులోని ఓ లాయరు గారబ్బాయి. ఎమ్. ఏ. ప్యాసయి వుద్యోగాన్వేషణ చేస్తున్న వ్యక్తి. తండ్రికి ఆస్తి, హోదా బాగున్నాయి! ఆరువేల కట్నం, ఆడబడుచు కట్నాలు, ఇతర లాంఛనాలు—వగైరా వగైరా! అన్నిటికీ తల వూపారట సుందరరామయ్య... బాగానే వుందను కొన్నాను.

కాని దురదృష్టవశాత్తూ యీ సంబంధమూ తప్పిపోయింది. అయినా ఒకందుకు మేలు! గతంలో లాగా పత్రికలూ అవీ పంచిపెట్టి, అన్నిపనులు చేసుకున్న తర్వాత గాకుండా, వాళ్ళ ధర్మమా అని ముందుగానే తెలియజేశారు. లగ్నం స్థిరం చేసుకున్నాక వారికి ఎవరి ద్వారానో తెలిసిందట యిదివరకటి విషయం. అందుచేత వెంటనే తమకు ఆరువేలు అందజేయవలసిందనీ, ఆ తర్వాతనే పెండ్లి ఏర్పాట్లు చేసుకోవలసిందనీ చెప్పారు. నిర్ణీత సమయానికే డబ్బు వేలకువేలు సమకూర్చలేని సుందరరామయ్య వున్నట్లుండి ఆరువేలు ఎలా తేగలడు?..తత్ఫలితంగా సంబంధం మొదటి దానిలాగానే అయింది. దెబ్బ తగిలిన కాలికే ముల్లు గుచ్చుకొన్నట్లయింది సరస్వతికి. మరింత క్రుంగిపోయింది మానసికంగా. పోనీ ఆతర్వాతనైనా సుందరరామయ్య ధోరణి మారలేదు, సరికదా యీ రెండు సంబంధాల వాళ్ళను కలిపి దుయ్యబట్టడం, మళ్ళీ సంబంధాలు వెతకడం, గాలికబుర్లు చెప్పడం పరిపాటయింది. "సంబంధాలు వెతుక నవసరంలేదు. నేను పెళ్ళి చేసుకోను." అని భీష్మించుక కూర్చొంది సరస్వతి తన తండ్రి చేసేపనులకు. పాపం సరస్వతి తల్లి, కుమార్తెను ఓదార్చలేక భర్తకు చెప్పలేక మధ్యలో సతమతమయింది. ఆవిడ కోరికపై, ఏదో తగిన సంబంధం నాకు తెలిసినంతవరకు విచారించ ప్రయత్నించాను కాని సుందరరామయ్య వాటిని "ఆ! ఇవెంతలే" అని తేలికగా నాలిక చప్పరించి, కొట్టి పారేసేవాడు.

ఒక్కొక్క సమయంలో సరస్వతి కంట తడి పెట్టుకొని, నాతో చెప్పేది, "నాకెక్కడయినా ఓ వుద్యోగం చూసి పెట్టన్నయ్యా! నీకు పుణ్యముంటుంది. మా నాన్న నాకు వివాహం చేసే పరిస్థితి ఈ జన్మలో రాదేమో? కనీసం నా కాళ్ళ మీద నేను నిలబడి, పొట్ట పోసుకునే ఆధారం దొరికితే చాలు!" అని. పాపం మనసులో ఎంత బాధపడి వుండకపోతే ఆ మాటలనేదో...?

"సరేలేమ్మా! అలాగే ప్రయత్నం చేస్తాను!" అని ఆవిడను సమాధానంతో తృప్తిపరిచేవాడినే కాని సరస్వతి వుద్యోగం చేయడం మనసులో నా కిష్ట ముండేది గాదు. పెళ్ళి చేసుకొని హాయిగా కలకల లాడుతూ యిల్లాలుగా చూడాలన్నదే నా ఆశ. కాని నా ఆశ, సరస్వతి కోరిక తీరే రోజు ఎప్పుడు వస్తుందో అనిపించేది.

....అలా కొంతకాలం గడిచింది. సరస్వతి తల్లి ఒత్తిడి చేత నేనే ఓ సంబంధం ప్రయత్నించాను. అబ్బాయి నాకు పరిచయమున్న వ్యక్తి కావడంచేత అన్నీ స్థిరపరచే బాధ్యత నేనే తీసుకున్నాను, నా చేతి మీదుగా నైనా సరస్వతి నో యింటిదాన్ని చేద్దామని. వరుడు బి. ఏ. ప్యాసయి యు. డి. సి.గా పని చేస్తున్నాడు. మేడలు, కార్లు లేకపోయినా ఏదో కొద్ది పాటిగా కలిగిన కుటుంబమే. అయినా కట్నం కానుకల విషయంలో అబ్బాయి మాట చెల్లలేదు. తండ్రి ముందు అతడు నోరెత్తలేడు. అందుచేత ఆ విషయంలో నేనెంత ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేదు. నాలుగువేల కట్నం, మరి యితర లాంఛనాలు వగైరాలన్నీ మాట్లాడుకొన్న తర్వాత, మరుసటి నెలలోనే ఓ సుముహూర్తం స్థిరం చేయబడింది. పెండ్లి పనులేవీ ఆడంబరంగా చేయవద్దని సుందరరామయ్యను నొక్కి చెప్పాను...

...రోజులు గడిచి ముహూర్త దినం సమీపించింది.....

పెండ్లి ముందురోజు సాయంత్రం వియ్యాలవారందరూ వచ్చారు. విడిదిలో సకలమూ అమర్చబడింది. కాని ఏక్షణంలో ఏం దురుసుగా మాట్లాడుతాడోనని సుందరరామయ్యను అప్పుడప్పుడూ హెచ్చరించవలసి వచ్చేది. కాని అనుకొన్నంతా అయింది. 'ఎదురుకొలువు' (ఎదురుకోలు) కార్యక్రమం పూర్తయి వధూవరు లిరువురూ పీటల మీద కూర్చున్నారు. పురోహితుడేవో వేదమంత్రాలు వల్లిస్తూ, వారిరువురినీ శాస్త్రోక్తంగా ఒకటి చేస్తున్నారు.. ఇంతలో వున్నట్లుండి పెండ్లి పందిరిలో ఓమూల నుండి కేకలు, ఘర్షణ వినపడి, నలుగురూ అటు చేరారు. ముక్కోపి, చండశాసనుడు అయిన వరుడి తండ్రి సుందరరామయ్య మీద మండిపడుతున్నాడు. తీరా ఆరాతీస్తే, "డబ్బుకు గడ్డితిని, అబ్బాయిని నాలుగు వేల రూపాయలకు అమ్ముకొన్నారనీ", ఇంకా ఏదో దురుసుగానూ, నిందాపూర్వకంగానూ పదిమందిలో అన్నాడట సుందరరామయ్య. దాంతో యిరువురి మధ్యా మాటామాటా పెరిగి, చివరకు రామ రావణ యుద్ధంగా పరిణమించింది. ఎవరెన్ని విధాల క్షమార్పణలు చెప్పినా ఆ పెద్దమనిషి తగ్గలేదు. విసురుగా వివాహ వేదిక దగ్గరకు వచ్చి, పెండ్లికుమారుని పీటల మీద నుండి లేవదీశాడు.

"సిగ్గు—అభిమానం వున్న వాడివయితే నా వెంట రారా! ఈ సంబంధం, వీరి మర్యాదా మనకక్కర్లేదు.. ఇంకా నిలబడుతావేం రారా!" అని గద్దించేసరికి, దాదాపు ఆరడుగుల మనిషి పిల్లిలా తండ్రి ననుసరించేయబోయాడు. నేను కల్పించుకొని, అతడి దగ్గరకు వెళ్ళి, అలా చేయడం న్యాయంకాదని బ్రతిమాలాను. కాని నిస్సహాయంగా తండ్రి వైపు చూపించాడు.

స్త్రీ సహజమైన లజ్జను, అభిమానాన్ని చంపుకొని, పెళ్ళిపీటల మీద నుండి లేచి వెళ్ళిపోబోయే వరుడి పాదాలపై బడి, దీనంగా అతడి కళ్ళలోకి చూచింది, "తన జీవితాన్ని అన్యాయం చేయవద్దని" ఆ చూపులకు కొడుకు లొంగిపోతాడేమోనని, "ఏరా

నిలబడ్డావే? మాతోపాటు వస్తావా? సుమ్మర్సిండి అని వెళ్ళమన్నావా?" అని తండ్రి మరోసారి కన్నెర్ర జేసేసరికి, పిడాలంటిన అబలను త్రోసివచ్చి వీధిలోకి నడిచాడు ఆ ప్రబుద్ధుడు. రంగురంగుల విద్యుద్దీపాలతో కలకల లాడుతున్న పెండ్లి పందిరి మరుక్షణంలో కళావిహీనమయింది. రసాభాస కావడంతో విమర్శలు, వ్యాఖ్యానాలు, ఓదార్పులు—ఏదో సినిమాలో ఘట్టం చూస్తున్నట్లు కండ్లముందే క్షణాల మీద జరిగిపోయింది.

గదిలో దూరి, తలుపులు వేసుకొని రోదిస్తున్న సరస్వతి ముఖం చూడలేక, కండ్లు తుడుచుకొని యింటికి నడిచాను. నా చేతుల మీదుగా సరస్వతినో యింటిదాన్ని చేద్దామని చేసిన ప్రయత్నమిలా అయేసరికి, మరింత బాధ కలిగింది...

...ఆ మరునాడే చాలా అర్జంటు పని మూలాన హుటాహుటిగా హైదరాబాదు వెళ్ళవలసి వచ్చింది. వెళ్లేముందు సరస్వతిని చూడడం కూడా కుదరలేదు. కాని వదినతో చెప్పి వెళ్ళాను, "సరస్వతి ఏ అఘాయిత్యమైనా చేస్తుందేమో? కాస్త కనిపెట్టి వుండమని!"—

పని పూర్తి చేసుకొని హైదరాబాదు నుండి తిరిగి వూరికి రాగానే, పరిచయస్థులూ నలుగురూ చెప్పిన మాటలు విని ఆశ్చర్యపోయాను, "ఏమిటీ సరస్వతి యింత పని చేసిందా?" అని! అడుగులు త్వరత్వరగా వేసి యిల్లు చేరాను. వీధి వరండాలో అన్నయ్య వడిలో కూర్చొని ఆడుకొంటున్న వారిజ 'చిన్నా!' అంటూ కాళ్ళకు చుట్టుకొంది. గబగబా బ్యాగు తీసి బిస్కట్ ప్యాకెట్ కోసం చేయి పెట్టేసరికి సరస్వతికిగాను హైదరాబాదు నుండి తెచ్చిన గాజుల ప్యాకెట్ చేతికి తగిలి, మనసు కలుక్కుమంది. బ్యాగు ఓ మూల విసిరిపడేసి, వంటింటిలోకి వెళ్ళాను. కూరగాయలు తరుగుతూ కూర్చొని వుంది వదిన. నన్ను చూచి పలుకరించింది..

"దారిలో నేను విన్న విషయం నిజమేనా వదినా?"

"ఏ విషయం?"—అర్థమయీ, కానట్లు చూసింది నావైపు.

"అదే!..సరస్వతి..." ఆ తర్వాత చెప్పడానికి నోరు రాలేదు నాకు.

"అవును వేణూ! నలుగురూ అలాగే అంటున్నారు. నిజానిజాలు భగవంతుడికే తెలియాలి." అంది ఎంతో బాధపడుతూ.

"సరస్వతి లేచిపోయిందా...?!" తల్చుకొనేసరికి బుర్ర తిరిగిపోయింది. అలాగే ప్రాప్పడిపోయాను..

"నాలుగురోజుల క్రితం ఓసారి సరస్వతి మనింటికి వచ్చింది. నీవు వూరి నుండి తిరిగి వచ్చేలోగా తాను ఎక్కడో బంధువుల వూరికి వెడుతున్నాననీ, బహుశా యిప్పుడల్లా తిరిగి రాకపోవచ్చుననీ చెప్పి, నీవు వస్తే యిమ్మని ఓ వుత్తరం యిచ్చి వెళ్ళింది. అందులో ఏమైనా సూచనప్రాయంగా నీకు వ్రాసిందేమో చూడు బాబూ!... నీ టేబుల్ సొరుగులో వుంచాను వుత్తరం"—

వదిన మాటలు పూర్తిగా విన్పించుకోక, త్వరత్వరగా గదిలోనికి పరుగెత్తి, టేబుల్ సొరుగులోని వుత్తరం చేతిలోకి తీసుకున్నాను. ఆత్రుతగా మడతలు విప్పి, చదివాను....

"వేణు అన్నయ్యా!

ఈ పాటికి నీవు నలుగురూ అనుకొనే మాటలు విని ఆశ్చర్యపోవడమే గాకుండా ఎంతో బాధపడిపోతుంటావు, 'ఏమిటి చెల్లాయి ఇంత పనిచేసిందా?' అని.. కదూ! పరిస్థితుల ప్రాబల్యం ఒక్క 'సరస్వతి'నే కాదు ఏ స్త్రీనయినా ఎంతటి సాహసానికైనా పురికొల్పుతుంది.

నేను అదృశ్యమైన మరుక్షణం నుండి వూళ్ళో ఎవరైనా పురుష పుంగవుడు కన్పించడం లేదా అని కూడా లోకులు వెతుకుతూ వుంటారు. అది లోకసహజం. కాని ఒకటి మాత్రం నిజమన్నయ్యా! గుండె మీద చేయివేసి చెప్తున్నాను, నీ చెల్లెలు ఎప్పటికీ ఏ నీచానికీ పాల్పడదు!

ముగుస మదిలో వలపు తలపు పొంగకుండా వుండాలే కాని, అది ఒకసారి రేకెత్తాక వరద గోదావరిలా పొంగి పొర్లుతుంది. కాదంటే, ఆ జ్వాల కార్చిచ్చులా మనిషిని నిలువెల్లా దహించి వేస్తుంది. ఇది ఒకరి దోషం కాదు! ప్రకృతి ధర్మం!!

నా జీవితంలో వివాహ ఘట్టం ఎలా పరిణమించిందోనన్న దానికి నీవు ప్రత్యక్ష సాక్షివి. ఒకసారి, రెండుమార్లు కాదు—మూడుసార్లు యజ్ఞవాటికలో బలి పశువులాగా నిలబడ్డాను. చివరకు మిగిలింది జీవచ్ఛవమైన బ్రతుకు. అలాంటి పరిస్థితిలో కన్నె మనసు ఎంతబాధపడుతోందో మాటలలో వ్రాయడం కష్టం. నేనెన్నాళ్ళున్నా వృద్ధకన్యనై పోవలసినదే తప్ప, మానాన్న నాకు సలక్షణంగా వివాహం చేసే ఘడియ వస్తుందని నేను ఆశించడానికి కూడా భయపడుతున్నాను. ఇలా వ్రాస్తున్నందుకు మన్నించు!

లోకంలో సుందరరామయ్య లాంటి తండ్రులూ, సరస్వతి లాంటి కుమార్తెలూ ఎంతోమంది బాధపడుతూనే వున్నారు. అలాంటి పరిస్థితిలో నాలాటి కన్యలకు వున్నవి రెండేమార్గాలు. ఒకటి—లోకం నుండి నిష్క్రమించడం! రెండు—తనదారి తాను వెతుక్కోవడం!!

ఆత్మహత్య చేసుకోవడం పిరికితనం కావచ్చు, లేదా సాహసం కావచ్చు. కాని నాలో ఆ భావం లేదు. అందుకే రెండవ మార్గాన్ని చూచుకొంటున్నాను. కానీ లోకులనుకొంటున్నట్లు 'లేచిపోవడం'తో కాదు. ఏదో నాకున్న విద్యార్హతలతో ఓ జీవనోపాధి కల్పించుకొని, నా జీవితానికి కావలసిన తోడు నేను నిర్ణయించుకోడానికి. ఏ మహిళా సంస్థ ఆశ్రయానికో వెడతాను. జీవితంలో స్థిరపడ్డాక మళ్ళీ నీకు తెలియజేస్తాను. కాని అంతవరకు దయచేసి, నా ఉనికి ఎవ్వరికీ తెలియజేయవద్దు.

సంఘం దృష్టిలో నేను చేస్తున్న పని 'తప్పు' కావచ్చు. నిజమే! ఇప్పుడున్న వ్యవస్థ అది. కాని యిది 'తప్పు' కాదని నా అభిప్రాయం. నాతో నీవు ఏకీభవిస్తావనుకొంటాను.

నా సాహసానికి మన్నించి, యీ చెల్లెలిని ఆశీర్వదించన్నయ్యా!

—సరస్వతి."

ఉత్తరం మడిచి టేబుల్ డ్రాయరులో పడేసి, అలాగే కూర్చుండిపోయాను.. "అవును సరస్వతీ!.. జీవితంలో శాపగ్రస్త అయిన స్త్రీ అలాగే అణగారిపోకుండా తనకు తాను ధైర్యంగా నిలబడి, తన జీవిత పథాన్ని తాను వెతుక్కోవడం యీనా 'యుగసంధి'లోని పెద్దతరం వారి దృష్టిలో 'తప్పు' కావచ్చు. కాని దీనిని నిందించక, అభినందించే యుగం కూడా వస్తుంది. ఆరోజు కోసమే ఎదురు చూద్దాం!.. ఏది ఏమైనా నీవు ఎక్కడైనా సుఖంగా వుండటమే నేను కోరేది!" అని మనసులోనే మౌనంగా సరస్వతిని దీవించాను.

